

# బొమ్మనోట్లు - బొరుసు మనుషులు

మెట్లు ఎక్కుతూ క్షణం ఆగాను. ఎంతోకాలంగా అనుకొంటున్నది మరోసారి మనసులోనే గుర్తు తెచ్చుకొన్నాను.

ఏం జరుగుతుందో, ఏమో!

అటో, ఇటో తేలుతుంది.

తలుపు మీద 'తిరుపతిరావు' అని ఇంగ్లీషులో ప్లాస్టిక్ బోర్డు మీద అక్షరాలు ఉన్నాయి. నిజానికి తిరుపతి కొండకిందే ఉంది. తిరుమలేశుడు కొండ మీదే ఉన్నాడు. ఇక్కడ మాత్రం ఆరేడు మెట్లు ఎక్కితేగానీ, తిరుపతి చేరే అవకాశం లేదు.

తలుపు తట్టాను.

ఒకటోసారి... మళ్ళీ కొట్టాను రెండోసారి!

తలుపు తెరుచుకోవటానికి ఇంకా వ్యవధి ఉన్నట్లుంది.

అటు ఆ తలుపు తెరుచుకోలేదు కానీ ఇటు ఆలోచనల తలుపు తెరుచుకొంది.

పని జరుగుతుందో లేదోనన్న భయం, ఆత్రత, ఆందోళన.

నాన్నగారు సొంతంగా చేసుకోవాల్సిన పని ఇది. కానీ, నా నెత్తిమీద పడింది. ఒక పూట తిని, మరోపూట ఆకలిలేదని అన్నం మానేసి అలా కూడబెట్టారు, పైస పైస చొప్పున, ఒకటా, రెండా... ఎన్నేళ్ళు...!

కడుపునిండా, కోరికతీరా, ఎప్పుడైనా తిన్నామా మేం! ఎప్పటికప్పుడు ఏవేవో ఆరోగ్య సూత్రాలు చెప్తూ ఉండేవారు. ఉప్మా తినాలంటే కడుపునొప్పి వస్తుందనేవారు. ఆరు అరటిపళ్ళు తింటే ఇంకేముందీ, జలుబు చేస్తుందనో, వాతం చేస్తుందనో అనేవారు. రేగిపళ్ళుతింటే దగ్గు, నారింజలు తింటే పడిశం - ఇలాంటివే ఆయనకు తెలిసినంత 'అనారోగ్య సూత్రాలు' ప్రపంచంలో ఎవరికీ తెలియవు కాబోలు! ఏ కారణం అయితేనేం, ఆయన మమ్మల్ని ఏదీ తిననిచ్చేవారుకాదు. రోజూ ఉదయం ఇంట్లోంచి వెళ్ళేవారు, మళ్ళీ రాత్రివేళ ఏ అర్ధరాత్రో ఇంటికి వచ్చేవారు. రోజంతా ఏం చేసేవారో మాకు తెలీదు.

"ఒట్టి పిసినారి!" అనుకునే వాళ్ళం మేం, చాటుమాటుగా.

పిసినారి అవునో కాదో ఇప్పుడు ఆలోచిస్తే ఒక్కోసారి కాదనే అనిపిస్తోంది. ఖర్చుపెట్టే గుణం చిన్నతనం నుంచి అలవడితే ఇంక ఏముంది, రెండు వేళ్ళసందులోంచి రూపాయి బిళ్ళను ఆపగలిగేవాళ్ళమా ఈ రోజు! చిన్నతనం కాబట్టి ఆయన గుణాన్ని 'పిసినారితనం' అని ముద్ర వేసేసుకొన్నాం కానీ, నిజానికి అదే మాలో కొంత పొదుపరితనానికి దారివేసింది.

ఆలోచనలకు అంతరాయం కలిగింది.

తలుపు తీశారు. ఆలోచనలకు, గతానికి స్వస్తివాచకం పలికి, వర్తమానంలోకి వచ్చిపడ్డాను.

ఎదురుగా ఆరేళ్ళ పిల్ల. చింపిరి జుట్టు, ఎంత నూనె రాసినా దువ్వెనకు, జడకు... ఒక కట్టుబాటుకు లొంగే గుణం లేనిది లాగా ఉంది. ముఖంలో ఎర్రని ఎరుపు తిలకం బొట్టు. కళ్ళకు నిండుగా కాటుక. అమాయకంగా ఉండే ఆ ముఖానికి ఆ జుట్టు ప్రత్యేక లక్షణంగా ఉంది.

"తిరుపతిరావుగారున్నారా?" అనడిగాను.

"మా నాన్నా" అడిగింది ఆ పాప.

"ఎవరే వచ్చింది సంధ్యా?" - ఇంట్లోంచి ఏదో ఆడ గొంతుక ప్రశ్న అది. మనిషి కనపడటం లేదు కానీ, ఆమె స్వరం బట్టి ఇంట్లో ఆమెదే పెత్తనం అని సులభంగా అర్థం అయిపోతోంది నాకు.

"నాన్నకోసమే...." అని జవాబిస్తూనే ఆ పాప, సంధ్య - "మీ పేరేమిటండి?" అనడిగింది.

ఇంతసేపయింది నేను వచ్చి. నాకు ఆ ఇంటి సంగతులు ఒకటొకటిగా అర్థం అవుతూనే ఉన్నాయి. కానీ ఇంట్లో తిరుపతిరావు ఉన్నాడో లేదోమాత్రం నాకు ఇంకా తెలీనే లేదు.

"నా పేరు సుందరం, మీ నాన్నగారికి తెలుసు నేనెవ్వరో.... సుందరం అని చెప్పు" అని చెప్తూ ఆగాను. "మీ నాన్న గారు....."

సంధ్య నా ప్రశ్నను పూర్తి కానివ్వలేదు. ఇంట్లోకి తుర్రుమంది.

నాలుగైదు నిమిషాల తర్వాత షర్టు వేసుకొంటూ తిరుపతిరావు బయటకు వచ్చాడు. ఇంతసేపూ, ఇంట్లోనే ఉన్నాడన్న మాట! బహుశా భార్యకు చెప్పి ఆవిడ వెళ్ళమన్నాక, ఆ అనుమతి పత్రం అందాక ఇంట్లోంచి బయటకు వచ్చి ఉంటాడు గురుడు అనుకున్నాను. ఇంట్లోంచా, వంటింట్లోంచా అనే సందేహం కూడా మనసులో తలెత్తింది. చిన్నగా నవ్వొచ్చింది నాకు.

ఆయనను చూసి నవ్వుకొంటే బాగుండదని నవ్వు ఆపుకొంటూ అన్నాను- "నా పేరు సుందరం. నేను కోదండరామయ్యగారి అబ్బాయిని!"

తిరుపతిరావు ముఖంలో 'ఏ కోదండరామయ్య' అనే ప్రశ్న కనపడింది, ఆ కనుబొమ్మలు ముడతపడ్డ విధానంలో.

గుర్తుచేసే పద్ధతిలో అన్నాను - "కోదండరామయ్యగారు అంటే - అప్పులకు డబ్బు ఇస్తారు. చూడండి....!" అని ఆగాను. వడ్డీలకు అని చెప్పబోయి గిల్టీగా అనిపించి ఆ మాట వాడలేదు.

"ఓ.... ఆయనా!... రండి, రండి.... మిమ్మల్ని నేను చూడలేదు కదా.. గుర్తు పట్టలేకపోయాను" అన్నాడు తిరుపతిరావు లోపలికి పిలుస్తూ.

ఇంట్లోకి అడుగు పెట్టాను ఇప్పటికి. ఇల్లు చూస్తే బాగానే ఉంది. గదిలో ఒక మూల కుర్చీ, టేబిలు, ఆ టేబిల్ పక్క ఒక టెలివిజన్, ఇంట్లో మరోపక్క సోఫా కమ్‌బెడ్. దానికి ఎదురుగా రెండు సోఫాలు, మధ్యలో... టీపాయ్, దాని మీద ఒక పేపరు. పక్కగదికి వెళ్ళే దారిలో పరదా... ఇల్లు వీలైనంత సింపుల్‌గా ఉన్నా, ఆధునికంగా ఉంది.

"కూర్చోండి!" అన్నాడు తిరుపతి రావు.

లోపలికి వెళ్ళి కూర్చోగానే అన్నాను నెమ్మదిగా. "మీరేమీ అనుకోనంటే..."

"చెప్పండి, పర్వాలేదు."

"మీరు నాన్నగారికి పదిహేనొందల రూపాయలు ఇవ్వాలని లెక్క రాసి ఉంది" క్షణం ఆగాను నేను.

"నిజమేననుకోండి"

"ఇరవైరోజుల క్రిందట మా నాన్నగారు పోయారు. పత్రాలూ అవీ చూస్తోంటే మీ గురించి ఉంది. ఇప్పుడు గనుక ఆ డబ్బు మీరు సర్దితే, మాకు కష్టకాలంలో ఆదుకొన్నట్లు అవుతుంది." నా వాక్యం ఇంకా పూర్తికాలేదు.

ఇంట్లోంచి "ఏమండీ, మాట!" అన్న పిలుపు వినిపించింది.

తిరుపతిరావు ముఖంలో ఇబ్బంది కనిపించింది. కానీ, సర్దుకొంటూ లేచాడు. "ఒన్ మినిట్, ఇప్పుడే వచ్చేస్తా" అంటూ లోపలకి వెళ్ళాడు.

నాన్నగారు పోయి ఇరవై రోజులయింది. ఆఖరి క్షణాల వరకూ ఆయన స్పృహలోనే ఉన్నారు. కానీ ఇంకా బతికి తీరుతానని నమ్మకం ఆయనకు. ఏం చూసుకొని, ఏం అనుకొని ఆయన ఆ నమ్మకంతో ఉండేవారో మాకు తెలీదు. కానీ నోరు విప్పి ఏమీ చెప్పలేదు. ఏ బాంకులో ఎంత మొత్తం ఉందో, ఎవరెవరు ఎంత బాకీ ఉన్నారో, ఆ బాకీలకు హామీలుగానో, తాకట్లుగానో ఇంట్లోనో, లాకర్లలోనో ఎక్కడ ఏమున్నాయో.. ఏమీ చెప్పనే లేదాయన. నోరు విప్పి ఏం చెబితే, ఏం చెప్పబోతే ఏం కష్టమోనన్నట్లుగా వ్యవహరించారు.

ఆఖరికి.... ఏముంది... హరీ అన్నారు తప్ప ఏమీ చెప్పలేదు మాకు.

అర్థమయింది మాకు, ఇక రాతకోతల్లో మిగిలిందే మాకు అని.

అంత సంపాదించిన మనిషి ఇంట్లో ఏమీ లేకుండా ఎలా పోగలిగారో మాత్రం అర్థం కాలేదు. కొందరి వద్ద వస్తువులు ఉంచుకొని, కొందరివద్ద నోటిమాటే హామీగా అప్పులిచ్చిన వ్యక్తి. 'పైసను రూపాయిగా, రూపాయను వందలుగా, వందల్ని వేలుగా ఎలా మార్చుకోవాలో నేర్చుకోండిరా' అనేవారు తరచుగా. కానీ... ఆ పద్ధతి ఇది కాదని మాత్రం మాకు ఇప్పుడు స్పష్టంగా తెలిసి వస్తోంది.

ఆయన డైరీలో తిరగేస్తే ఏవోవో పేర్లు. అంకెలు, లెక్కలు...

అవన్నీ ఎలా అర్థం వేసుకోవాలో, ఆ పేర్లవెనుక చిరునామాలు ఏమిటో తెలుసుకోగలగటం బహుశా ఆయన్ని పుట్టించిన బ్రహ్మకైనా తరం కాదనిపిస్తోంది. అటుతిప్పి ఇటుతిప్పి ఆ పేర్లకు అర్థాలు చెప్పుకోగలిగిన మాకు మిగిలింది ఆఖరికి ఆరేడు అడ్రసులు.

తిరుపతిరావు ఆ లెక్కల్లో మొదటివాడు. మొత్తం పద్దెనిమిది వందల బాకీ, అప్పుడెప్పుడో మూడొందల రూపాయలు చెల్లుబడింది. మిగిలింది ఇంకా పదిహేనొందలు అప్పు. అది వసూలు చేసుకొనేందుకు నా తాపత్రయం.

ఇక్కడ ఈ అప్పు వసూలు అయిపోతే - ఇప్పుడు ఇవ్వకపోవచ్చుకానీ, ఎప్పుడు ఇస్తాడో అదయినా చెప్తే.... రెండో అడ్రసుకు పయనం కట్టొచ్చు అనుకొన్నాను. జేబు ఒక్కసారి తడిమి చూసుకొన్నాను. అడ్రసులు, ఇవ్వాల్సిన మొత్తాలు రాసిన కాగితం నిక్షేపంలాగా తగిలింది.

దగ్గుతూ గదిలోకి వచ్చాడు తిరుపతి రావు.

ఆశగా అటుకేసి చూశాను.

'చెప్పండి!... అన్నాడు నాకేసి చూస్తూ తిరుపతి రావు.

క్షణం నివ్వెరపోయినా, తత్తరపాటు కప్పిపుచ్చుకొంటూ అన్నాను "చెప్పాల్సింది మీరే! ఎప్పుడు ఇస్తారో చెబితే..." తప్పు అనేశాను. ఇప్పుడు ఇస్తే అనాల్సింది అనుకున్నాను.

"అదే చెప్పాలనుకుంటున్నాను నేను - మీ పేరు సుందరం అని కదా అన్నారు. మీరు పొరపడ్డారు - నేను మీ నాన్నగారికి బాకీ అణాపైసలతో సహా తీర్చేశాను!"

ఉలికి పడ్డాను నేను. ఏమంటున్నాడు... తీర్చేశాననా? సరిగ్గానే వింటున్నానా నేను?

"అదేమిటండీ, ఇప్పుడే కదా బాకీ ఉన్నాను అన్నారు."

"నేనా? అలా అన్నానా? తీసుకున్న మాట నిజమే కానీ, తీర్చేశాను! అదే చెప్పబోతూ ఇంట్లోకి వెళ్ళాను" అన్నాడు తిరుపతి రావు.

నా ముఖంలో రంగులు మారుతూ ఉండి ఉండొచ్చు - నాకు అది తెలుస్తూనే ఉంది. క్షణం కిందట తిరుపతి రావు నాకు పదిహేను వందలు బాకీ. ఇప్పుడు తీర్చేశాను అంటున్నాడు. ఇంకా కొంచెం గట్టిగా అడిగితే నేనే అతనికి బాకీ అనేలా ఉన్నాడు.

డబ్బు!

డబ్బుకు ఎంతో శక్తి ఉంది. ఈ సూత్రం నాకు తెలుసు. ఎంత పనైనా చేయిస్తుంది. ఎన్నైనా అనిపిస్తుంది!

కానీ - ఇలా నాలుకమీద మాట నాలుకమీద ఉండగానే మెలికలు తిప్పగలిగే స్తోమతు దానికి ఉందని నాకు తెలీదు. ఇప్పుడు అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నాను.

అయినా ఆఖరి ప్రయత్నం చేస్తూ అన్నాను: "తిరుపతిరావు గారూ... ఒకటి అడుగుతాను, చెప్పండి. అయిదు నిమిషాల క్రిందట మీరు నాకు డబ్బు బాకీ అనే సంగతి మీరు ఒప్పుకోబోయారు. కానీ మా నాన్న పోయారని చెప్పేసరికి ప్లేటు తిప్పేశారు."

"ప్లేటు తిప్పడం ఏమిటి ఇందులో! అక్షరాలా ఇవ్వాల్సింది అంతా ఇచ్చేస్తేనూ...."

"ఇచ్చినట్లు ఏదైనా సాక్ష్యం... అంటే ఏ ఎమ్.వో. రశీదు కానీ.... అలాటిదే ఏదైనా సరే..."

తిరుపతిరావు చాలా కోపంతో అన్నాడు: "ఏంటయ్యోయ్! చాలా ఎక్కువ మాట్లాడుతున్నావ్! అసలు అంతదాకా దేనికి? మీ నాన్న నాకు అప్పు ఇచ్చినట్లు నాకు సాక్ష్యం చూపించు. నువ్వు అన్నట్లు మనీయార్డరు రసీదో, పత్రమో, కాగితమో.... వెళ్ళు.... వెళ్ళవయ్యా. వెళ్ళి నీ సత్తా కాగితాల మీద చూపించుకో, అప్పు తీర్చానురా మగడా అంటుంటే ఇంకా సాక్ష్యం కావాలిట..!"

తిరుపతి రావు ఇంకా ఏదో అంటూనే ఉన్నాడు.

నేను ఆ గడప దిగి, మెట్లు దిగి వెనక్కు వచ్చేశాను. తిరుమలకు వెళ్లనక్కర్లేకుండానే నాకు తిరుక్షవరం జరిగింది.

తెలివితక్కువ వాడిని. నాన్నగారు పోయారు, కష్టంలో ఉన్నామని చెప్పాను. దెబ్బ తినేశాను. అవకాశం తీసుకొని డబ్బు ఎగగొట్టేశాడు.

ఎక్కడైనా బావే కానీ అక్కడ - డబ్బు దగ్గర మాత్రం బావ కాదన్నమాట! దొంగ వెధవ!! డబ్బు కోసం గడ్డి తినేశాడు.

వాడిని ఇక తలుచుకోనక్కరలేదు అనుకొంటూనే నా ఆలోచనల్లో వాడికి సమాధి కట్టేశాను.

జేబులోంచి కాగితం తీశాను. కాగితం మీద మొత్తం ఆరు అడ్రసులు ఉన్నాయి. పై పేరు తిరుపతి రావుది. పెన్ను తీసుకుని ఆ పేరు మీద కసిగా నల్లని సిరా పూశాను.

రెండో వ్యక్తి పేరు సోమేశ్వరం. ఇవ్వాల్సింది అయిదు వందల చిల్లర.

రాజుల సొమ్ము రాళ్ళ పాలు అని లోకోక్తి. మానాన్నగారు ఇంత సంపాదించారు. కానీ ఏం లాభం? అది ఎవరి పాలయిందో అర్థం కావటంలేదు. హిందీలోనో, ఉర్దూలోనో ఒక సామెత ఉందిట - ప్రతి బియ్యపు గింజమీదా అది తినాల్సిన వారి పేరు రాసి ఉంటుందని! మా నాన్నగారు సంపాదించిన ప్రతి పైసా మీద దాని భోక్తల పేరు రాసి ఉంది కాబోలు!!

అడ్రసు వెతుక్కుంటూ నడిచాను.

రెండుసార్లు కుడివైపు తిరిగి అరఫర్లాంగు పై దూరమే నడిచాక అప్పుడు వచ్చింది సోమేశ్వరం ఇల్లు. ఇల్లు కనుక్కోవటం కష్టం కాలేదు.

ఇతను ఏమంటాడో ఏమో.... తిరుపతి రావు లాగా క్షణాలమీద మాట మార్చేస్తాడో, లేకపోతే అసలు అప్పు తీసుకోనే లేదంటాడో?

ఇలాంటి వాళ్లంతా తండ్రి దృష్టిలో నమ్మకస్థులు. మర్యాదస్థులు. గీటురాయి మీద రాసి చూస్తే కానీ బంగారం నిగ్గు తేలదు. మనిషి నమ్మకం విషయంలో గీటురాయి డబ్బే... డబ్బు తీసుకునేటప్పుడు చెప్పే ఇచ్చకపు మాటలు, ఆప్యాయతలు డబ్బు తిరిగి అడిగినప్పుడు ఉండవు. మొహాలు కూడా చూసుకోని పరిస్థితులు ఏర్పడతాయి. కానీ ఒకటే అదృష్టం... అలాంటి వ్యక్తులకు ఆ తర్వాత ఆమడ దూరంలో ఉండొచ్చు. పోతే పోతుంది గాక, అప్పటికి కొంత డబ్బు! అలాంటి వారివల్ల మరో విషయంలో మరింత కష్టం కలగకుండటమే నిజమైన లాభం అనుకోవాలి!!

'నాన్నగారు పోయారు' అని నిజం చెప్పటం వల్ల కలిగిన నష్టాన్ని ఈసారి ఆ సంగతి చెప్పకుండా ఉండటం వల్లనే పూడ్చుకోవాలి.

అబద్ధం చెప్పకపోయినా ఫర్వాలేదు కానీ, నిజం మాత్రం చెప్పను - తెలివి తక్కువ నిర్ణయమే అయినా లోకం తీరువల్ల ఆ నిర్ణయమే తీసుకోవాల్సి వచ్చింది నేను. అలాటి నిర్ణయం తీసుకున్నందుకు సిగ్గుపడుతూనే గేటు లోపలకి తోసి, ఆ బండలమీద అడుగు పెట్టాను.

ఇల్లు ఇంకా పూర్తి కాలేదు. లోపల ఎలా ఉందో తెలీదు. కానీ పైన ప్లాస్టరింగ్ ఇంతవరకూ కాలేదు. ఆ స్థితిలోనే ఆ ఇల్లు చాలా కాలం నుంచి ఉందన్న దానికి సాక్ష్యంగా ఇంటి గోడల ఇటుకల మీద దుమ్ము పేరుకొని ఉంది.

గుమ్మం ముందు నిలబడి పిలిచాను. "సోమేశ్వరంగారూ!" అని.

లోపల్నించి ఒకావిడ బయటకు వచ్చింది. "ఆయన ఇంట్లో లేరండి!" అంది ఆవిడ.

'చచ్చానురా!' అనుకున్నాను.

"నాపేరు సుందరం. నేను కోదండరామయ్య గారి అబ్బాయినండీ - మీరు నాన్నగారికి డబ్బు ఇవ్వాలి. ఆ విషయం అడుగుదామని..." ఆగిపోయాను ఇంకా ఏం చెప్పాలో తెలీక.

"అయ్యో! తెలీలేదండి. రండి, లోపలకి! ఆయన లేరు. ఒక అరగంటలో వస్తారనుకుంటాను. మీరు వచ్చి లోపల కూర్చున్నా సరే, లేకపోతే అరగంట తర్వాత వచ్చినా సరే... మీ ఇష్టం!" అంది ఆవిడ.

క్షణం ఆలోచించాను. ఇంట్లో ఎవరూ లేరు. ఆవిడ ఒక్కతే ఉంది. నేను ఉండటం అంత బాగుండకపోవచ్చు. పైగా ఏవో అవీ ఇవీ మాట్లాడుతూ ఉంటూ పొరబాటున నేను, నాన్నగారు పోయిన సంగతి నోరుజారినా జారచ్చు. ఇప్పటికే ఒకసారి నోరు జారి దెబ్బ తినేశాను. ఊహు, ఆ తప్పు మళ్ళీ చేయను!

"సర్లెండి. ఒక అరగంటలో వస్తాను మళ్ళీ. ఆయన వస్తే ఉండమని చెప్పండి!" అన్నాను వెనుతిరుగుతూ.

కానీ మనసులో భయం. అనుమానం తలెత్తుతూనే ఉన్నాయి. ఈ మహానుభావురాలు ఏం చెప్తుందో ఏమో! తిరుపతి రావు తన పెళ్ళాం మాట విని అరనిమిషంలో మాట మార్చేశాడు. అరగంట తర్వాత వస్తే బహుశా సోమేశ్వరం 'ఇంకా ఇంటికి రాలే'దనో, లేకపోతే 'పోన్లెండి, మీకు ఆలస్యం అవుతోంది... మీ రొచ్చారని చెప్తాను' అనో సమాధానం ఇవ్వవచ్చు ఈవిడ! ఈలోగానే నే నొచ్చానని చెప్పి, భర్తను మరో అరగంటసేపు అటూ ఇటూ తిరిగి రమ్మన్నా అనొచ్చు!!

'సరే, ఏదెలా జరగాల్సి ఉంటే అలాగే జరుగుతుంది!' అనుకొన్నాను వేదాంత ధోరణిలో పడిపోతూ..

దగ్గరలో ఉండే హోటల్‌కు వెళ్ళి కూర్చుని అరగంటసేపు గడిపేశాను. గడియారంలో ముల్లు తిరుగుతున్న కొద్దీ నా గుండెలో గుబగుబలు అధికమయినాయి. ఇంత శ్రమా వృధా అవుతుందేమో! 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు' అన్న పద్యకారుడు ఆఖరున అప్పిచ్చి వసూలు చేసుకోవటం ఆదిశేషుని తరం కూడా కాదని చెప్పి ఉండే బాగుండేది!

సోమేశ్వరం రెండు రోజుల క్రిందటి వరకు ఎవరో నాకు తెలీదు. కానీ ఇప్పుడు... నా ఆలోచనలన్నింటికీ కేంద్రం అయికూర్చున్నాడు.

బయలుదేరాను - మళ్ళీ సోమేశ్వరం కోసం.

ఇంటికి వెళ్ళేసరికి సోమేశ్వరం కాబోలు, బయటే ఉన్నాడు. గేటు తీసుకొని లోపలికి వెడుతూంటే గుర్తుపట్టాడు కాబోలు... భార్య చెప్పి ఉంటుంది కనుక... ఎదురొచ్చాడు. ఇంత స్వాగత సత్కారాలు చేస్తున్నాడంటే నెత్తిన ఎంత పెద్ద చెయ్యి పెడతాడోనన్న భయం పెరిగింది.

ఇంట్లోకి వెళ్ళి కూర్చున్నాక నెమ్మదిగా కదిపాను అసలు విషయం. "మీరు అయిదొందల దాకా బాకీ ఉన్నారు మాకు!"

సోమేశ్వరం నా మాట కట్ చేశాడు.. "మీ నాన్నగారు ఇచ్చింది వెయ్యిపైగా ఉంది. కొంత చెల్లు కట్టేశాం. ఆ రోజుల్లో ... ఇంటి మీద ఎంత డబ్బు పెట్టినా సరిపోని రోజులు. మీ నాన్నగారిలాంటి వాళ్ళు తలో వెయ్యి, రెండు వేలు ఇచ్చి ఆదుకోబట్టి ఇల్లు ఈ మాత్రం అయినా అయింది!"

సోమేశ్వరం మాట్లాడేది పాము చావకుండా, కర్ర విరగకుండా ఉండే పద్ధతిలో ఉంది. ఇంతకీ ఇస్తాడా, ఇవ్వడా?'

అదే అడిగాను – "నాన్నగారు మిమ్మల్ని అడిగి ఆ డబ్బు తెమ్మన్నారు నన్ను!"

సోమేశ్వరం ఆశ్చర్యపోయినట్లు ముఖం పెట్టాడు. "మీ నాన్నగారు చెప్పారా? అలాటి మనిషికాదే ఆయన! అయినా.... దొడ్డమనిషి.... పోయికూడా పదిహేను రోజులయిందనుకుంటాను...!"

ఈసారి ఆశ్చర్యపోవటం నా వంతు అయింది. నాన్నగారు పోయిన సంగతి తెలిసిందన్న మాట! అంటే ఇక డబ్బు పోయినట్లే లెక్క! ఇక లేవటం మంచిది. సమయాన్ని కూడా వృధా చేసుకోవటం దేనికి?!

"ఉండండి... వస్తా! అని సోమేశ్వరం ఇంట్లోకి వెళ్ళాడు.

భార్యతో సమాలోచనలకు కాబోలు.. ఏ కారణం చెప్పి తప్పించుకొంటే మంచిదా అని 'కార్యేషు దాసి కరణేషు మంత్రి'తో చర్చకు కాబోలు వెళ్ళాడు!!

రెండు నిమిషాల తర్వాత సోమేశ్వరం బయటకు వచ్చాడు.. "క్షమించండి. అనుకోకుండా ఆలస్యం అయిపోయింది. మీ నాన్నగారు ఉండగానే తీర్చేద్దామనుకొన్నాను. ఆ అదృష్టం దక్కలేదు" అంటూనే అయిదు వంద రూపాయల నోట్లు, ఇంకా ఒక యాభై నోటు ఇచ్చాడు. "మీరు లెక్క చూసి ఇంకా ఎంత ఇవ్వాలో అది రాసి పంపిస్తే, అదీ పంపేస్తాను" అన్నాడు అపాలజిటిక్‌గా.

"ఇంకా నయం. ఇప్పుడే బాంకుకు వెళ్ళి తీసుకు వచ్చారాయన. ఇల్లు గచ్చు చేయిద్దామనుకొంటున్నాం. కానీ, దానిదేముంది... ఇప్పుడు కాకపోతే, మరోనెలలో, రెండు నెలల తర్వాతైనా చేయించుకొంటాం! మీరెన్ని ఇబ్బందుల్లో ఉన్నారో, ఏమో...." అంది సోమేశ్వరం భార్య.

ఇంకా కొంతసేపు అక్కడే ఉండి, బయటికొచ్చాను.

ఎటు పోవాలో నిర్ణయించుకొనేందుకు జేబులో కాగితం కోసం తడిమాను. జేబులో సోమేశ్వరం ఇచ్చిన నోట్లు తగిలాయి. తీసి చూశాను.

– ఎంత పొరబాటుగా అంచనా వేశాను! డబ్బు అందర్నీ చెరచలేదు. పతనం అయిన వాడిని, పతనం కాదల్చుకున్న వాడిని మాత్రమే డబ్బు మరింత అధోలోకాలకు చేర్చుతుంది. అంతేకాని, అందర్నీ నైతికంగా నాశనం చేయగలగటం డబ్బు వల్లకాని పని.

లోకంలో ఇంకా నీతి బతికే ఉన్నదనే విషయాన్ని నాకు అర్థమయేలా చెప్తున్నాయి నా చేతిలో గాలికి కదుల్తున్న నోట్లు!!

– *ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక, 23.06.1982*